# తెలుగువారి అనుసంధానమే టిడిపి లక్ష్యం

## ప్రజాదరణ భరించలేకే జిఒ నంబర్ 1 - ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం - టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

**చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా గల తెలుగువారిని అనుసంధానం చేయడమే లక్ష్యమని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్రాంతి సంబరాలకు కుటుంబ సమేతంగా సొంతూరు నారావారిపల్లికి చేరుకున్న ఆయన శుక్రవారం మీడియాతో కాసేపు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో లభిస్తున్న ఆధరణను చూసి భరించలేక వైసిపి ప్రభుత్వం జీఓ నంబర్ 1 తీసుకువచ్చినట్లు దుయ్యబట్టారు. టిడిపి, జనసేన, ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు పెడితే వైసిపి వారే స్వైరవిహారం చేస్తారు కానీ కేసులు మాత్రం



ప్రతిపక్ష పార్టీ నాయకులపై పెట్టడం, జైలుకు పంపడం రాక్షస పాలనకు సంకేతమన్నారు. 2014-2019 మధ్య కాలంలో టిడిపి చేపట్టిన అనేక కార్యక్రమాలకు సంబంధించిన సంక్షేమ ఫలాలు ప్రజలకు లభించే సమయంలో రాక్షస పాలన ప్రారంభం కావడం ప్రజల దురదృష్టమన్నారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మిడియా, ప్రజల పట్ల ప్రభత్వం అహంకారపూరితంగా వ్యవహరించడం, బానిసలుగా చూస్తున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ మీటింగ్‌పై వైసిపి నేతల తిట్ల పురాణంపై దుయ్యబట్టారు. యావత్ ప్రపంచం కుగ్రామమైన నేపధ్యంలో ప్రభుత్వం ఎన్నికుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా తమ పోరాటం ఆగదన్నారు. భావితరాల భవిష్యత్తును కాపాడుకుంటూనే తెలుగువారి చైతన్యం కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశమన్నారు. గడచిన మూడున్నరేళ్ళల అనేక కార్పోరేట్ కంపెనీలు పారిపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడ వున్నా మన తెలుగు వారందరూ తమ సొంతూరులో తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి సుఖశాంతులతో సంక్రాంతి సంబరాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# రాబోయే ఎన్నికలలో 175 సీట్లు గెలవాలి



## టిటిడి ఛైర్మన్ వైవిసుబ్బారెడ్డి

**అద్దంకి, జనవరి 13, ప్రభాతవార్త** రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని 175 సీట్లలో వైసిపి పార్టీయే గెలవాలని టిటిడి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మేదరమెట్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగిన అనంతరం బహిరంగసభ జరిగింది. ఈ సభకు అద్దంకి ఎఎంసి వైస్‌ఛైర్మన్ యర్రం రత్నారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో మూడున్నర ఏళ్లుగా సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకటించిన విధంగానే అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రపంచం కరోనాతో అతలాకుతలమై ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో కూడా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అపకుండా ప్రతి లబ్దిదారుడికి అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాలను రాబోయే 16 నెలల కాలంలో ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి 175 సీట్లు వైసిపి గెలుచుకునేలా కృషి చేయాలని ఆయన పార్టీ అభిమానులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఈ సభ నందు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గం నుండి వైయస్సార్ సిపి అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని కూడా ఆయన కోరారు. అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా జరిగేలా కృషి చేస్తానని యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు కూడా కృషి చేస్తానని వైవీ ప్రకటించారు. జిల్లా ఇంచార్జి మంత్రి కె.సత్యనారాయణ మాట్లాడుతూ మేదరమెట్ల గ్రామంలో, ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూస్తే నాకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి గుర్తుకొస్తున్నారని ఆయన అన్నారు. వైవీ సుబ్బారెడ్డి రాబోయే రోజులలో ఇంకా ఉన్నత స్థాయి పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వైవీ సుబ్బారెడ్డి ఈ రాష్ట్రానికి మంత్రి కావాలని ఆకాంక్షించారు. గ్రామంలోకి ప్రవేశించే సమయంలో వైవీ సుబ్బారెడ్డికి అతిధులకు ఘనస్వాగతం లభించింది. సభావేదిక ప్రక్కన ఉన్న వైయస్సార్ విగ్రహానికి ఫ్లొక్లైనర్‌తో గజమాలను వేసి ఆయా నేతలు వైయస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభావేదిక పైకి వచ్చిన వైవీ సుబ్బారెడ్డిని హర్షధ్వానాలు, కార్యకర్తల కేరింతల మధ్య ప్రొక్లైనర్ సహాయంతో గజమాలను వైవీకి వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డితో పాటు బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి, ఉపముఖ్యమ ంత్రి, దేవాదాయశాఖామంత్రి కె.సత్యనారాయణ, ఎమ్మెల్సీ పోతుల సునీత,జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇంచార్జి, శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన క్రిష్ణచైతన్య,మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ కనకారావు మాదిగ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచు గరటయ్య, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరి రవి, వరప్రసాదరెడ్డి, జడ్పీటీసి టి.వెంకటరమణ, ఎంపిటి ప్రసన్నకుమారి, డిఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.విజయమ్మ,డిఐఓ డాక్టర్ వెంకటేశ్వరరరావు, మేదరమెట్ల సర్పంచ్ ఎలిశమ్మ, రత్నారెడ్డి, జి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## సైసై అంటున్న పందెం రాయుళ్లు సిద్ధమవుతున్న పందెంకోళ్లు



**అంబాజీపేట,జనవరి 13,ప్రభాతవార్త:** కాళ్ళకు మువ్వలు కట్టి చిందేస్తే నాట్యం..కాళ్ళకు కత్తికట్టి బరిలో దిగితే యుద్ధం..ఈ కత్తుల యుద్ధంలో విజయమో,వీరస్వర్గమో తెలుసుకునే రోజు వచ్చేసింది.విలాసవంతమైన నివాసగృహాల్లో ఉంచి,బలిష్టమైన ఆహారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంటే మాకంటే అదృష్టవంతులు లేరనుకున్నాం. మమ్మల్ని అపురూపంగా మేపిన వారు తలనిమిరిన చేతులతోనే కాళ్ళకు కత్తులు కడుతుంటే జరగబోమేది తెలుసుకుని ఎగిరిపోతే..ఎంత బాగుంటుందోనని పిస్తుం దంటూ పందెంకోళ్ళు ప్రాణభయంతో కొట్టు కుంటున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని పుర ష్కరించుకుని సంప్రదాయ క్రీడగా అభివర్ణించే ( కొంతమంది జూదరులు) కోడి పందేలను రాష్ట్రంలో పలు జిల్లాలో యధేచ్ఛగా నిర్వహిం చాలని ఏర్పాట్లు చేసుకుంటుంటే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోడి పందేలను నిర్వహించబోమంటూ అధికారులు ఆంక్షలు విధించడంతో ఎంతో సంబరపడ్డాము. కోనసీమ జిల్లాలో పుట్టినందుకు గర్వంగా భావించారు. అధికారుల ఆంక్షలకు ఏం చేయాలో తెలియని కోడిపందేల బరుల నిర్వాహకులు, పందెంరాయుళ్ళు దిక్కుతోచక చుక్కలు చూస్తుంటే ఎంతో సంతోషించాము.సంక్రాంతి పండుగ మూడు రోజులూ అధికారుల కఠిన ఆంక్షల నడుమ సాఫీగా జరిగిపోతే, ఎప్పటిలాగే బాదం,పిస్తా,జీడివప్పు,చోళ్ళు.గంటులు ఆరగిద్దామని ఆశగా ఎదురుచూస్తున్నాము. ఏమయ్యిందో ఏమో శుక్రవారం సాయంత్రం పిడుగులాంటి వార్త మా చెవులకు చోకడంతో ప్రాణభయం పట్టుకుందంటూ పందెం కోళ్ళు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.పి.గన్నవరం నియోజకవర్గంలోని అంబాజీ పేట,అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో కోడి పందాలు, గుండాటలు, అశ్లీల నృత్య ప్రదర్శ నలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గత వారం రోజులుగా ఆయా మండలాల పోలీసులు విస్రృతంగా ప్రచారం చేసారు.పలు గ్రామాల్లో కొన్ని చోట్ల దొంగచాటుగా సిద్ధం చేసిన బరులను పోలీసులు చిద్రం చేసారు.కోనసీమ జిల్లాలో తమ ఆటలు సాగవని ఇతర జిల్లాలకు వెళ్లిపోదామనుకుంటున్న పందెంరాయుళ్ళకు తీపికబురు అందడంతో ఎగిరి గంతేస్తున్నారు. ఖద్దరు రాయబారాలు ఫలిం చాయో ఏమో స్థబ్దుగా ఉన్న బరుల నిరా హకులు ఒక్కసాగిగా కాళీగా ఉన్న జాగాలపై పడ్డారు. ఎత్తుపళ్ళాలుగా ఉన్న భూమిని యంత్రా లతో చదును చేస్తూ చకచకా బరులను సిద్ధం చేసేస్తున్నారు.గత వారంరోజులుగా పందెంరా యుళ్ళను భయపెడుతున్న పోలీసు ఆంక్షలు ఏమైపోయాయంటూ సామాన్య ప్రజలు గొను క్కుంటున్నారు.అధికారుల మాటలకు అర్థాలే వేరులే...అంటూ రాగాలు తీస్తున్నారు.అధికారుల ఆంక్షలు గెలిచాయో..పందెంరాయుళ్ళ పంతం నెగ్గిందో.. తెలుసుకునేందు కోనసీమ ప్రాంత వాసులు మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

# లోకేష్ యువగళం

## మహా పాదయాత్ర రూట్ మ్యాప్ సిద్ధం

### 400రోజులు, 4000వేల కిలోమీటర్లు

### కుప్పం నుండి ఇచ్ఛాపురం

### రోజుకు 10 కిలోమీటర్లు మేరకు పాదయాత్ర

**మంగళగిరి, జనవరి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,నిరుద్యోగమే ఏజెండా గా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేపట్టనున్న సంగతి విధితమే.రోజుకు 10కిలోమీటర్ల చొప్పున... 400రోజులు... 4000వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. అయితే కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సాగనున్న ఈ పాదయాత్ర రూట్ మ్యాప్ విషయంలో సందిగ్ధత నెలకొంది. తాజాగా ఆ గందరగోళానికి తెం దించుతూ లోకేష్ యువగళం మహా పాదయాత్ర రూట్ మ్యాప్ ఖరారైందని తెలుస్తుంది.ఈనెల 27న మధ్యాహ్నం 12గంటలకు పాదయాత్ర ప్రారంభించనున్నారు.తొలి 3రోజులు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటిం చనున్నారు. నియోజకవర్గంలోని లక్ష్మీపురంలోని వరదరాజస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్/మే(2024) నెలలో జరిగే అవకాశం ఉందని,ఈ మేరకు నారా లోకేష్ పాదయాత్ర మార్చి2024వరకు తన పాదయాత్ర కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.30ఏళ్ళ నారా లోకేష్ తన తండ్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిద్యం వహిస్తున్న కుప్పం నుండి యాత్రను ప్రారంభించనున్నారని తెలుస్తుంది.యాత్రలో భాగంగా నాలుగురోజుల పాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలోను 4రోజులు పాదయాత్ర సాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. లోకేష్ అగ్రనేతగా ఎదగడానికి పాదయాత్ర ఎంతగానో దోహద పడుతుందని తెదేపా నేతలు అంటున్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ మంత్రి శ్రీనివాసగౌడ్

**ఇంద్రకీలాద్రి, జనవరి 13, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానమునకు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక యువజన శాఖ మంత్రి వి.శ్రీనివాస గౌడ్ కుటుంబ సభ్యులతో సహా ఆలయమునకు రాగా, వారిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి, స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం వేదపండితుల ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటము, ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు. - నిత్యాన్నదాన విరాళ దాతలు : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిత్యము నిర్వహించే అన్నదాన పథకమునకు కందుకూరుకు చెందిన ఫణీంద్రరెడ్డి మరియు కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు రూ.1,00,000/-లు విరాళమును అందచేశారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం వేదపండితుల ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటము, ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు.



# ప్యాకేజీకి అమ్ముడు పోలేదని పవన్ లక్ష్మీనరసింహాస్వామి, చిరంజీవిపై ప్రమాణం చేయాలి: మంత్రి గుడివాడ అమర్నాథ్

**అమరావతి,డిసెంబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడు పోయిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇష్టానుసారం అవాకులు,చవాకులు మాట్లాడతున్నారని ఏపీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు.వైఎస్సార్‌ను లెక్క చేయలేదన్న పవన్ 2009 ఎన్నికల తరువాత ఎక్కడకు పలాయనం చిత్తగించడని ప్రశ్నించారు,భయపడే,భయంతోనే పవన్ చంద్రబాబును వెన్నంటి ఉంటున్నారని,అంతర్గతంగా ఏమీ జరిగిందో ఎవ్వరికి తెలియని ఇద్దరు అనుకుంటారన్నారు.పవన పిరికితనంతోనే టీడీపీ చాటునుండి మాట్లాడుతున్నారన్నారు.ఆరు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన తమ కుటుంబంపై నోటికొచ్చినట్లు మాట్లాడారన్నారు.యువశక్తి సభ ద్వారా యువతకు ఏం సందేశం ఇచ్చారని అమర్నాథ్ ప్రశ్నించారు. మా తాత నుంచి మా కుటుంబం రాజకీయాల్లో ఉంది. మా తండ్రి మంత్రిగా చేసారు.నేను మంత్రిగా కొనసాగుతున్నాను, నా పేరు మీకు తెలియదేమో ఉత్తరాంధ్ర ప్రజలకు తెలుసు,నీలాంటి వారి నోటి నుంచి నా పేరు రావడం కుడా ఇష్టం లేదన్నారు.చంద్రబాబుతో రెండు గంటల పాటు దేశ రాజకీయాలపై మాట్లారంటే ఎవరు నమ్మరు సీట్లు ప్యాకేజీ పంపకాల గురించే చర్చించారు.డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేసి చెప్పగలరా?.లక్ష్మీనరసింహప్వామి.చిరంజీవిపై ప్రమాణం చేసి చెప్పాలన్నారు. రాజకీయాల్లో జగన్ హీరో. పవన్ విలన్ అని అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు.ఎవ్వరిని బడితే వారిని అందులో నీ సామాజివర్గం వాళ్ళనే తిట్టి.నీకు కౌంటర్ ఇస్తే కాపులను తిట్టారంటావా? ఎక్కడ దిక్కుమాలిన బతుకు నీది అని ప్రశ్నించారు.కాపులంతా ఐక్యంగా జగన్‌తో ఉంటారన్నారు.చెరువుపై కప్ప బెదిరింపులా ఎవ్వరు భయపడరన్నారు. రణక్షేత్రంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన తీరుపై ఏపీ మంత్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.మంత్రులు దాడిశెట్టిరాజా,ధర్మాన ప్రసాదరావు,జోగి రమేష్,ఆదిమూలపు సురేష్ తదితరులు పవన్‌కు మంత్రి భ్రమించిందన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధి అతని ఎంత మా త్రం ఇష్ట ంలేదన్నారు.యువతకు ఆయన ఇచ్చే సందేశం ఏమీటన్నారు.ఇంటికో ఉద్యోగమని చంద్రబాబు మోసగిస్తే పవన్ ఎక్కడన్నారు.2009 ఎన్నికల్లో అప్పటికి ముఖ్యమంత్రి వైఎస్‌ను తప్పతాగి నోటికి వచ్చినట్లు వాగి.జనం వెంటపడితే పలాయనం చిత్తగించిన పవన్ తరువాత ఎక్కడకు చేరారన్నారు.ఇతగాడి బలుపు ఆయన కార్యకర్తలే తీస్తారన్నారు.



# జగ్గయ్యపేట పరిసర గ్రామాల్లో కోడి పందాలు, జూదాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు

**జగ్గయ్యపేట, జనవరి 13, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ రావటంతోనే కోడిపందాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక క్రీడలకు తెరలేస్తుంది. పోలీసులు ఎంత జాగ్రత్త వహించినా తుదకు ఔత్సాహికుల మనోరథమే నెరవేరుతుంది. ఏప్రభుత్వంలోనైనా ఇది సహజంగా జరుగుతుండే తంతే. కోర్టు ఉత్తర్వులు, జిల్లా ఉన్నతాధికారులు జారీచేసివున్న ఆదేశాలతో పోలీస్‌శాఖ తమ విద్యుధర్మాలను నిర్వర్తిసుండటం, పరిపాలకుల మౌఖిక సూచనలతో సంప్రదాయ క్రీడలకు అవకాశం ఇవ్వాలనే ఔన్నత్యంతో మూడు రోజులపాటు పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించటం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగే ప్రహసనమే. ఏపార్టీ ప్రభుత్వం అధికారంలోవున్నా ఇది కామన్‌గా జరుగుతున్న నగ్నసత్యమే. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతం ఉభయ తెలుగు రాష్ట్రాలకు సరిహద్దు నియోజకవర్గ కాగా సంక్రాంతి పర్వదిన మూడు రోజులపాటు కోడిపందాలు, జూదాల నిర్వహణకు ఔత్సాహికులు ఏర్పాటుచేసిన బరిలపై రెండు రోజుల క్రితం పోలీసులు మెరుపుదాడులతో కూల్చివేశారు. చదును చేసిన పొలాలు, మామిడి తోటలను ట్రాక్టర్లతో దున్నించారు. జూదాల నిర్వహణకు ఏర్పాటుచేసిన గుడారాలు, బరులకు పాతిన రాళ్ళు, కట్టిన ఇనుప తీగలను తొలగించివేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అసాంఘిక కార్యకలాపాలను కొనసాగించే ప్రసక్తిలేదని పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అయితే హరిహరాదులు అడ్డుపడినా కోడిపందాలు, జూదాలు ఆగే అవకాశం లేదని నిర్వాహకులు ధీమాగావున్నారు. ఒకపక్క పోలీసులు కూలుస్తున్నా బరులు సిద్ధంచేస్తున్నారు. తెలంగాణా రాష్ట్రం నుండి కూడా జూదరులకు ఆహ్వానాలు పంపు తున్నారు. చుట్టు పక్కల 50 కిలోమీటర్ల పైబడిన దూరంలోని గ్రామాల వారు కూడా ఇక్కడి పందాలకు వచ్చేందుకు ఉవ్విళ్ళూరు తున్నారు. గత ఏడాది పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవటంతో కోడి పుంజుల కాళ్ళకు కత్తులు కట్టి భారీ ఎత్తున జగ్గయ్యపేట, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, బూదవాడ, రెడ్డినాయకతండ, గండ్రాయి ప్రాంతాల్లో జూదాలు శిబిరాలు వేసిమరీ నిర్వహించారు. కోతముక్క, పేకాట, గుండాట, బ్లైండ్ గేమ్స్, లిక్కర్ అమ్మకాలు యధేచ్ఛగా కొనసాగించారు. అసాంఘిక పనులు చట్టవ్యతిరేకంగా జరుగుతున్నా, సంప్రదాయం పేరుతో అనైతిక జూదాలకు తెరలేపుతున్నారు.



# జగన్ అంటే అంత భయం దేనికి నాయనా పవను: పేర్నినాని



**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** వాగడం,నోరు వాయికొట్టించుకోవడం పవన్ కల్యాణ్‌కు సాధారణ విద్యలని ఏపీ పూర్వపు మంత్రి పేర్ని వెంకట్రామయ్య తిట్టిపోసారు. రణక్షేత్రం వెళ్ళి నువ్వేమి అన్నావు, ఎవ్వరికి భయపడనన్నావు, 15 సార్లు ఈ మాట సభలో అన్నావన్నారు.

భయంలేని వాడికి అధికార పార్టీ పేరు ఉచ్చరించి, ఇన్ని సార్లు జంకవ్వారు. నువ్వు కులాల పట్ల ప్రచారం కోసం నువ్వు అంటున్న మాట కాపులు గుర్తుంచు కొంటారన్నారు.

నువ్వు కాపులను ఎలా మోసగించావో ప్రపంచానికి ప్రతి ఇంచు తెలుసన్నారు.

# రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు పిహెచ్‌డిలు, పిజి గ్రాడ్యుయేట్‌లు అభ్యర్థన ఎల్‌ఎల్‌బి, ఎంటెక్‌లు కూడా!

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో భారీగా పోలీసు రిక్ర్యూట్‌మెంట్ జరుగుతుంది.ఈ నేపథ్యంలో కీలక వాస్తవం వెలుగు చూసింది.ఈ పోస్టులకు కనీస విద్యార్హతకు మించిన వారు అభ్యర్థన దాఖలు చేసారు.పోస్టు గ్రాడు య్యేషన్ పూర్తి పిహెచ్‌డి పొందిన వారు.ఎల్‌ఎల్‌బీ,ఎంటెక్ చేసిన వారు సదరు అభ్యర్థుల్లో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.వీరిలో అత్యధికులు కానిస్టేబుళ్ళ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం నిరుద్యోగ సమస్యకు అర్దబడుతుంది.డీజీపీ కార్యాలయం నుంచి అందిన సమాచారాన్ని అనుసరించి కానిస్టేబుల్ పోస్టుకు ఇంటర్ అర్హత సరిపోతుంది.ఆ కనీస అర్హతతో అభ్యర్థన చేసుకున్న వారు 2,97,655 మంది ఉన్నారు.ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులైతే 10 తరగతి ఉత్తీర్ణులైన వారు.ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరై ఉంటే సరిపోతుంది.వారు ఇంటర్ పరీక్ష పాస్ కావాల్సిన అవసరం లేదు.ఇటువంటి వారు 16,945 మంది ఉన్నారు.ఇక పీజీ చేసి పిహెచ్‌డి చేసిన వారు 10 మంది,,ఎల్‌ఎల్‌బీ చేసి 94 మంది.ఎంటెక్ చేసి 930 మంది. ఎంకాం చేసి 1527 మంది.ఎంబీఏ చేసి 5.284 మంది.ఎంఎస్సీ చేసి 4,365 మంది.ఎంఏ చేసి 1.845 మంది.బీసీఏ చేసి 756 మంది.బీఎస్సీ చేసి 61,419 మంది,బికాం చేసి 40,548 మంది బీటెక్ చేసి 31,695 మంది.బీఏ చేసి 21,024 మంది.డిగ్రీ.ఇంటర్ డిప్లమో చేసిన వారు 15,254 మంది ఉన్నారు.6100 కానిస్టేబుల్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే 5,03,486 మంది దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో 3,95,415 మంది పురుషులు,1.08,071 మంది మహిళలు, ఒక్కో పోస్టుకు సగటున 83 మంది దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో 3,95,415,పురుషులు 1,08,071 మంది మహిళలు ఉన్నారు.అంటే ఒక్కో పోస్టుకు సగటున 83మంది పోటీ పడుతున్నారు. మొత్తం కానిస్టేబుల్ ఉద్యోగాలకు అభ్యర్థన దాఖలు చేసిన వారిలో 2,77%.పీజీలు 30.89%., డిగ్రీ, 59.11%. మంది ఇంటర్ చదివిన వారు ఉన్నారు.ఈ నెల 22న వీరికి ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించబడుతుంది.దరఖాస్తుల్లో ఎక్కువ మంది బీసీ,ఎస్సీలే.53,778 మంది ఓసీలు,2,74,567 మంది బీసీలు,1,31,87 మంది ఎస్సీలు,43,266 మందిఇ ఎస్టీలు దరఖాస్తు చేసుకున్నారు.

# ఇస్రో శాస్త్రవేత్త నంబినారాయణన్‌పై గూఢచర్యం కేసు అక్రమం

## క్రయోజనిక్ సాంకేతికతను అడ్డుకునే విదేశీ కుట్ర : కేరళ హైకోర్టుకు సిబిఐ నివేదిక

**తిరువనంతపురం, జనవరి 13:** ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్‌పై 1994లో నమోదు చేసిన గూఢచర్యం కేసులో ఆయన్ని అప్పుడు అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధమని సిబిఐ స్పష్టం చేసింది. శుక్రవారం కేరళ హైకోర్టుకు సిబిఐ సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. నకిలీ గూఢచర్యం కేసు జాతీయ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశమని సిబిఐ పేర్కొంది. ఇస్రోలోని ప్రముఖ శాస్త్రవేత్తలపై తప్పుడు కేసులు పెట్టించడం ద్వారా మన వైజ్ఞానిక అభివృద్ధిని అడ్డుకునేందుకు విదేశీ శక్తులు కుట్ర పన్నాయని సిబిఐ తన నివేదికలో తెలిపింది. 1996లోనే నంబి నారాయణన్‌ను నిర్దోషిగా సిబిఐ ప్రకటించింది. ఇస్రో పరిశోధనలో కీలకమైన క్రయోజనిక్ టెక్నాలజీని అడ్డుకునేందుకు నంబి నారాయణన్‌పై కేసు నమోదు చేయడంలో విదేశీ శక్తుల కుట్ర ఉన్నట్లు ఆయన తరపు న్యాయవాది సి.ఉన్నికృష్ణన్ కూడా హైకోర్టు దృష్టికి తెచ్చారు. దాంతో, 1990లలో ఆయనపై దర్యాప్తు జరిపి కేసు పెట్టడానికి కారణమైన ఐబి, కేరళ పోలీస్ మాజీ అధికారులపై సిబిఐ కేసులు నమోదు చేసింది. నారాయణన్‌పై తప్పుడు కేసుకు కారణమైన అధికారుల బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా సిబిఐ నుంచి నివేదికను హైకోర్టు కోరింది. దాంతో, సిబిఐ తన తాజా నివేదికను హైకోర్టుకు సమర్పించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఓ మాజీ డిజిపిసహా నలుగురు మాజీ అధికారులకు కేరళ హైకోర్టు యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయగా సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# కోడికత్తి కేసులో నిందితుని బెయిల్ నిరాకరించిన ఎన్‌ఐఎ కోర్టు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ విమానాశ్రయం నాలుగేళ్ళకు పూర్వపు ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిపై కోడి కత్తితో హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడు శ్రీనివాస్ బెయిల్ పిటిషన్ విజయవాడ ఎన్‌ఐఏ కోర్టు కొట్టివేసింది.తనకు బెయిల్ ఇప్పించాలంటూ శ్రీను తన న్యాయవాది ద్వారా వేసిన పిటిషన్‌పై ఎన్‌ఐఏ కోర్టు నేడు విచారించింది.ఈ వ్యవహారంలో బాధితుడుగా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ కోర్టుకు రావాల్సిందిగా కోర్టు వ్యాఖ్యానించింది.ఈ కేసులో బాధితుడిగా ఉన్న సీఎం జగన్‌ను ఇంత వరకు విచారించలేదని నిందితుడి తరపు న్యాయవాది ఎన్‌ఐఏ కోర్టు దృష్టికి తీసుకుని వెళ్ళినప్పుడు న్యాయమూర్తి ఇలా వ్యాఖ్యానించారు.ఎన్‌ఐఏ న్యాయవాది ఈ అంశానికి బదులిస్తూ జగన్‌కు విచారించామని కోర్టుకు తెలిపారు.ఆ విషయాన్ని చార్జిషీటులో ఎందుకు చేర్చలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు.బాధితుని వాంగ్మూలం రికార్డు లేకుండా సాక్షులును విచారిస్తే ఫలితం ఏముంటందన్నారు.ఈనెల31 కేసు విచారణను వాయిదా వేసారు.

